# SRI NARLA VENKATESWARA RAO MEMORIAL LECTURE - 2025



# నార్ల సాహిత్య రచనలు - విశ్లేషణ


## ఆచార్య సి. మృణాళిని

తెలుగు భాషావిభాగాధిపతి, ఆర్య విశ్వవిద్యాలయం, సిలికానాంధ్ర (అమెరికా)

విశ్రాంత ఆచార్యులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,

హైదరాబాద్



Organised by

**Dr. B.R. Ambedkar Open University**

Prof. G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

# About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October, 1991. The establishment of this University, the first of its kind in India, heralded an era of affirmative action on the part of the Government to provide opportunities of higher education to all sections of the society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 104 study centres spread across Telangana state including 10 Regional Co-ordination centres and 6 centres exclusively meant for women learners. Prison inmates serving life sentence also enroll themselves to pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal and an exclusive Study Centre for Army personnel and their family members is established at AOC, Secunderabad. The University offers UG, PG, Diploma, Certificate and Ph.D. programmes including Professional Programmes, paving the way for life long learning.

# Naarla Memorial Lecture



## నార్ల సాహిత్య రచనలు - విశ్లేషణ


**ఆచార్య సి. మృణాళిని**

తెలుగు భాషావిభాగాధిపతి, ఆర్య విశ్వవిద్యాలయం, సిలికానాంధ్ర (అమెరికా)

విశ్రాంత ఆచార్యులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,

హైదరాబాద్



Organised by

**Dr. B.R. Ambedkar Open Univeristy**

Prof. G. Ram Reddy Marg, Road No. 46,
Jubilee Hills, Hyderabad (TS) 500033

# నార్ల సాహిత్య రచనలు - విశ్లేషణ

## మృణాళిని

*స్వేచ్ఛ యన్నచో యథేష్ట వర్తన కాదు;*
*నిక్కమైన స్వేచ్ఛ నియతి గలదె:*
*నియతి లేని స్వేచ్ఛ నిప్పుతో చెల్లాట*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

*పరుల స్వేచ్ఛ కొక్క ప్రతిబంధకమ్ముగా*
*నిలువరాదు సుమ్ము నీదు స్వేచ్ఛ*
*పంచుకొనని స్వేచ్ఛ కుంచుక పోవును*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

ఈ పద్యాలు చూస్తే ఈనాటికీ నార్ల వారి ప్రాసంగికత ఎంత ఉందో అర్థమవుతుంది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో 'స్వేచ్ఛ'ను దుర్వినియోగం చేసుకుంటున్న ఎందరో చదవాల్సిన పద్యాలివి. ఇటువంటి రచనలు అర్ధశతాబ్ది కిందే చేసిన నార్లవారి మాట ఈ తరంవారికీ బంగారుబాటే. 1908 లో జన్మించి, 1985 లో మరణించిన నార్ల వెంకటేశ్వరరావు తన 77 ఏళ్ల జీవితకాలంలో ప్రధానంగా పాత్రికేయరంగంలో చిరస్మరణీయుడిగా గుర్తింపు పొందారు. అయితే పత్రికారంగంతో పాటు, సాహిత్యరంగంలోనూ వారి బాట విశిష్టమైనది. ఈ ప్రసంగవ్యాసం వారి సాహిత్యకృషికి మాత్రమే పరిమితం.

నార్ల వెంకటేశ్వరరావు అసాధారణ పాత్రికేయులన్న విషయం తెలిసిందే. కానీ ఆయన కలం కేవలం పత్రికాసంపాదకుడిగా తన విధినిర్వహణను సమర్థంగా చేయడంతో ఆగిపోలేదు. అది సమాంతరంగా సాహిత్యానికీ విస్తరించింది. పద్యం, నాటిక, ఏకాంకిక, వ్యాసం ఆయన ఎన్నుకున్న సాహిత్య ప్రక్రియలు. వీరి సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అంశం హేతువాదదృక్పథం. హేతువాద ఉద్యమాన్ని తెలుగులో బలంగా ప్రచారం చేసిన త్రిపురనేని రామస్వామి చౌదరి తర్వాత, ఆ దృష్టితో

సమాజాన్ని, సాహిత్యాన్ని ప్రభావవంతంగా తన రచనల్లో విమర్శకు పెట్టిన రచయిత నార్ల వెంకటేశ్వరరావే. పాత్రికేయుడిగా ఎటువంటి సూక్ష్మదృష్టి, నిశిత పరిశీలన, పరిశోధనా దక్షత, మౌలికత (ఒరిజనాలిటీ) చూపారో అదే మనకు ఆయన సాహిత్య రచనల్లోనూ కనిపిస్తుంది.

స్థూలంగా వీరి సాహిత్య వ్యవసాయాన్ని చెప్పాలంటే – 1943లో 'రష్యన్ కథలు' అన్న పేరుతో కథల అనువాదాన్ని చేశారు. 1945లో కథలు, వ్యాసాలు, నిర్వచనాలు సంపాదకీయాలతో కూడుకున్న వివిధ విషయాలను సంకలనం చేసి 'కదంబం'గా రూపొందించారు. 1947లో రైతు జీవితాన్ని, ఇతర సమకాలీన వస్తువులను ఇతివృత్తంగా స్వీకరించి 'కొత్తగడ్డ' అనే పదహారు నాటికల సంపుటి ప్రకటించారు. 1956 డిసెంబర్ లో "వాస్తవమ్ము నార్ల వారిమాట" అన్న మకుటంతో వేమనను, గురజాడని అనుకరిస్తూ "నార్ల వారిమాట" అన్న పద్యాల సంపుటి వెలుగులోకి తెచ్చారు. 1957లో అప్పుడప్పుడు రాసిన యాభై అయిదు గేయాలను సంకలనం చేసి "జగన్నాటకం" అన్న కవితా సంపుటి ప్రకటించారు.

ఆయన హేతువాదదృక్పథాన్ని విస్పష్టంగా తెలిపిన సాహిత్య రచనలు, ఎక్కువమందిని ఆకర్షించినవీ, వివాదాస్పదమైనవీ పౌరాణిక నాటికలు – జాబాలి, సీత జోస్యం, నరకంలో హరిశ్చంద్రుడు, ద్రౌపది (పంచరాత్రం), హిరణ్యకశిపుడు. ఇందులో మొదటి మూడు నాటికలకు వీరు రాసిన సుదీర్ఘమైన ముందు మాటలు (నాటికల కంటే వీరి పీఠికలే పుటల్లో ఎక్కువ). బ్రిటిష్ నాటక రచయిత బెర్నార్డ్ షాని గుర్తుకు తెస్తాయి. ఆఖరి రెండూ ఆయన మరణానంతరం ప్రచురింపబడ్డాయి. వీటికి పీఠికలు లేవు.

వీరు రాసిన కొన్ని గేయాలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదాలయ్యాయి. వీరి 'కొత్తగడ్డ' నాటికల సంపుటిని శ్రీ బాలశౌరిరెడ్డిగారు "నయా ధర్తీ" పేరుతో హిందీలోకి అనువదించారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా వీరి నాటికలు నిర్ణయింపబడ్డాయి. 1957 నుంచి చాలాకాలం కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులుగా ఉన్నారు. భారతీయ సాహిత్య నిర్మాతలు (Makers of Indian Literature) అన్న శీర్షిక క్రింద ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడెమివారి ఆధ్వర్యంతో ఆంగ్లంలో వీరేశలింగం, వేమన, గురజాడలపై నార్ల గ్రంథాలు ప్రచురించారు. ఇవి భారతీయ భాషలన్నిటిలోకి అనువదించబడ్డాయి. 1971లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కన్నడ స్టడీస్,

మైసూరా వారి గోష్టిలో Gandhiji in Indian Literature అన్న అంశంపై చేసిన ఉపన్యాసం ముద్రించి కన్నడంలోకి అనువదించారు.

"వాస్తవమ్ము నార్లవారి మాట" అన్న మకుటం మార్చి "నవయుగాలబాట నార్లమాట" అన్న శీర్షికతో 1974లో కొన్ని పద్యాలు చేర్చి ప్రకటించారు. సాహిత్య అకాడమీ పక్షాన గురజాడవారి "కన్యాశుల్కము"ను 1975లో కుదింపు కూర్పును చేశారు.

1979లో విస్తృతపీఠికతో "సీతజోస్యం" ప్రకటించగా 1981లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందినది.

రామాయణ, భారతాలపై తన రచనలు ఎక్కువ మంది పాఠకుల ఆదరణను, సమ్మతిని పొందవని ఆయనకు తెలుసు. అందుకే చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు. "నాకు కావలసింది మీ ఆమోదం కాద్ము మీలో ఆలోచన. నేను కోరేది మీ ప్రశంస కాద్ము మీలో జిజ్ఞాస' (సీత జోస్యం – పుట 10). ఆయన రచనల్ని శాసించిన సూత్రం ఇదే. ఆయన ఎవరి మెప్పుకోసం సాహిత్యం రాయలేదు. ఎవరికి నచ్చకపోయినా రాయడం మానలేదు. తన పంథా మార్చుకోలేదు. హేతువాదం, అభ్యుదయదృక్పథం ఆయన జర్నలిజాన్ని, సాహిత్యాన్ని కూడ శాసించిన ధోరణులు. వీటి వెలుగులో చూసినపుడు పురాణాలపై ఆయన ఆగ్రహం, తీవ్రవిమర్శ స్పష్టమవుతుంది. ఆయన కంటే ముందు త్రిపురనేని, చలం, తాపీ ధర్మారావు కూడ పురాణాలపై విమర్శలు కుప్పించారు. చలం పౌరాణిక నాటికలూ రచించాడు. నార్ల రాసిన పౌరాణిక నాటికల్లో మొట్టమొదటది 'జాబాలి'.

## జాబాలి (1974)

ఈ నాటికలో మూడే పాత్రలు: రాముడు, జాబాలి, వశిష్ఠుడు. ఇది ఏకాంకిక. దశరథుడి మరణవార్త విని కుమిలిపోతున్న రాముణ్ణి జాబాలి ఏదో మాట్లాడాలని పిలిపించడంతో నాటిక ఆరంభమవుతుంది. భరతుడి మనవిని విని రాముడు తిరిగి అయోధ్యకు వచ్చి పరిపాలన చేపట్టాలని జాబలి కోరతాడు. రాముడు, తన తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం 14 ఏళ్ల వనవాసం తర్వాతే తిరిగి వస్తానని అంటాడు. వీరిద్దరి మధ్య రాముడి వనవాసం వెనక ఎవరున్నదీ, ఆ క్రమం గురించి చర్చ జరుగుతుంది. రాముడి వనవాసం వెనక ఉన్నదీ, అక్కడ విషయాలన్నిటినీ నియంత్రిస్తున్నదీ వశిష్ఠుడని జాబాలి చెప్పడం, రాముడు ఆగ్రహించడం

జరుగుతాయి. కైకేయి పట్టాభిషేకం ముందు రోజు రాత్రి దశరథుడిని కోరడం కంటే చాలా ముందే, కైకేయితో వివాహసందర్భంలోనే కేకయ మహారాజు తన మనమడికే పట్టం గట్టాలని కోరాడనీ, దానికి దశరథుడు అంగీకరించాకే అ పెళ్ళి జరిగిందనీ, ఆ విషయం వశిష్ఠుడికి తెలిసి కూడా రాముడిని పట్టాభిషిక్తుణ్ణి చేయమని తండ్రికి సలహా ఇచ్చి, వీరి కుటుంబంలో తగాదాలకు కారకుడయ్యాడనీ జాబాలి చెప్పినపుడు రాముడు విస్తుపోతాడు. జాబాలి అనేక రకాలుగా వాదించి 'పురోహితుల చేతిలో కీలుబొమ్మవి కాబోకు' అంటూ వశిష్ఠుడి మీద తీవ్ర విమర్శలు చేస్తాడు. రాముడికి జాబాలి ధోరణి నచ్చదు. ఆయనపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తాడు. ఈలోగా వశిష్ఠుడు ప్రవేశిస్తాడు. రాముడు, జాబాలి మాటలు చెప్పి, ఇతనసలు వైదికుడే కాదు. ముని లక్షణాలు లేవని ఆరోపణలు చేస్తాడు. వశిష్ఠుడు జాబాలి తన శిష్యుడని, అతన్ని రాముడు శంకించకూడదనీ అంటూ జాబాలిని వెనకేసుకు వస్తాడు. జాబాలి వ్యంగ్యంగ? 'అది నిజమనీ, తను వశిష్ఠుడిని గురువుగా భావిస్తాననీ, కేవలం రాముణ్ణి పరీక్షించడానికే ఇంత సేపూ ఆ విధంగా మాట్లాడాననీ' అంటాడు. రాముడు అయోమయంలో పడిపోతాడు. నాటిక ముగించేసరికి పాఠకుడు ఆలోచనలో పడతాడు. జాబాలి నిజంగా రాముణ్ణి పరీక్షించాడా? లేక వశిష్ఠుడి గురించి ఆయన చేసిన ఆరోపణలు చిత్తశుద్ధితో చేశాడా? అని. తన పీఠికలో నార్ల వారన్నట్లు జాబాలి చివరి ఘట్టంలో మాట్లాడినదంతా వ్యంగ్యమేనని పాఠకులు గ్రహిస్తారని ఆశిస్తాన్నుమో వాళ్లు గ్రహించలేకపోతే అది తన రచనలో లోపమేనని అన్నారు.

ఈ నాటికకు రాసిన పీఠికలో నార్ల వారు రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు తర్వాత కూడ చాలా చోట్ల చేసినవే. స్థూలంగా అవి:

1. వాల్మీకి పేరు మీదున్న రామాయణం పూర్తిగా వాల్మీకి రాసింది కాదు; ఇందులో ఎక్కువ భాగం ప్రక్షిప్తాలు.

2. వాల్మీకి రాసింది కేవలం అయోధ్యకాండ మాత్రమే. అందుకే ఈ కాండలో రాముడి వ్యక్తిత్వం స్పష్టంగా, గందరగోళం లేకుండా ఉంటుంది. ఇతర కాండలు చదివితే రాముడు ఏకపత్నీవ్రతుడు కాడనిపిస్తుంది. అయోధ్యకాండలో మాత్రమే రాముడి గుణాలలో ఎలాంటి వైరుధ్యమూ ఉండదు. కనక ఇది మాత్రమే వాల్మీకి రాసింది యథాతథంగా లభిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ఈ కాండలో అభూతకల్పనలు తక్కువ.

3. రాముడిని మనిషిగా చూపించిన సంస్కృత రామాయణం తెలుగు కవుల, భక్తుల చేతిలో పడి నాశనమైపోయింది.

4. రామాయణం ఆదికావ్యమే అయినా, మొదట గ్రంథస్థమైంది మాత్రం మహాభారతమే. రామాయణం ఎక్కువ కాలం మౌఖికంగానే ఉంది. భారతం తర్వాతే అది గ్రంథరూపం దాల్చింది.

5. రామాయణ పారాయణం మొదలుపెట్టాకే దాని గొప్పదనం నశించింది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "పారాయణం అనగానే జిజ్ఞాస స్థానాన్ని భక్తి ఆక్రమిస్తుంది; వివేకాన్ని ఒక పక్కకు నెట్టి విశ్వాసం తిష్ఠ వేస్తుంది' (జాబాలి, పుట 9).

6. ఉత్తర రామాయణం ఖచ్చితంగా ప్రక్షిప్తమే. వాల్మీకి రాసినది కాదు.

7. వాల్మీకి రచన అతిసుందరమైంది. ఎన్నో చోట్ల వాల్మీకి అలంకారరచనను నార్ల చాలా మెచ్చుకుంటారు. కవిగా వాల్మీకిని ఉన్నత పీఠంపై కూర్చోబెట్టారు. కాకపోతే రామాయణాన్ని పారాయణ కావ్యంగా, భక్తి గ్రంథంగా మార్చడమే ఆయన సహించని విషయం.

8. అయితే వాల్మీకి రాసింది కొద్దిగానే మనకు లభిస్తోంది; ఇప్పుడు వాల్మీకి పేరిట లభిస్తున్నది ఆయన రాసింది కాదనే ఉద్దేశంతో తన పీఠిక అంతటా' వాల్మీకి 'రామాయణం అనకుండా, సంస్కృత రామాయణం అనే అంటారు.

వాల్మీకి పేరిట చలామణీలో ఉన్న రామాయణంలో ఎన్నో పరస్పర వైరుధ్యంతో కూడిన సంభాషణలు, వర్ణనలు ఉన్నాయి. వీటన్నిటికీ రామాయణంలోంచి అనేక ఉదాహరణలు ఇచ్చారు. అరణ్యవాసం నాటికి సీతారాముల వయస్సులతో సహా.

నార్ల దృష్టిలో రాముడిని బ్రాహ్మణీకరణ చేయడానికి పండితులు ప్రయత్నించారు. నిజానికి అతను మద్యం, మాంసం సేవించినట్లు సంస్కృత రామాయణంలో ఎన్నో రుజువులున్నాయి. రామాయణ, భారతాల కాలం గురించి చేసిన నిర్ధారణలు హేతుబద్ధంగానే ఉన్నప్పటికీ, పండితులు వాటి చరిత్రను స్థిరీకరించేటప్పుడు ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. రాముడి పట్ల ఉన్న భక్తిభావం వల్ల, ఆయన రాముడిని తిట్టిన విషయమే ఎక్కువమంది గుర్తు పెట్టుకున్నారుగానీ, కార్యకారణ సంవిధానంతో ఆయన చేసిన సూచనలను పెడచెవిని పెట్టారు.

రామాయణంపై తను ఎన్ని విమర్శలు చేసినా, ప్రజలకు రాముడిపై భక్తి తగ్గదని కూడ ఆయన ఒప్పుకున్నారు.

## నరకంలో హరిశ్చంద్రుడు – 1982

హరిశ్చంద్రులు ఎంతమంది అని ప్రశ్నిస్తూ, ఐతరేయ బ్రాహ్మణంలో ఉన్న హరిశ్చంద్రుడు, రాజర్షి హరిశ్చంద్రుడు, మార్కండేయపురాణంలో హరిశ్చంద్రుడు అని ముగ్గురున్నారని తేల్చారు. ఎక్కువ ప్రచారంలో ఉన్నది మాత్రం మార్కండేయపురాణంలో ఉన్నదీ, గౌరన, రామరాజభూషణుడి కావ్యాల్లో, కందుకూరి, బలిజేపల్లి లక్ష్మీకాంతం వంటి ఆధునికుల నాటకాల్లో ఉన్నదీ ఒకే హరిశ్చంద్రుడు, అతనే సత్య హరిశ్చంద్రుడు కనక అతని కథ మీదే నార్లగారి విసుర్లు. ఆ కథనే ఆయన మార్చి నాటికగా రచించారు.

ఏ విషయం గురించి చెబుతున్నా, అది మాత్రమే చెప్పే అలవాటు లేదు నార్లకు. ఆయన చెబుతున్నది పౌరాణిక గాథ కనక, సామాన్య ప్రజలు అత్యంత ప్రామాణికంగా భావించే, భక్తితో పూజించే వ్యక్తుల కథను కనక, దాని చుట్టూతా ఉన్న అనేక విషయాలను ప్రస్తావించడం, వాటిని కూడ సహేతుకంగా చర్చించడం వారి పద్ధతి. ఈ పుస్తకానికి పీఠిక, గ్రీకు పురాణాలతో హిందూ పురాణాల తులనాత్మక పరిశీలనతో ఆరంభమవుతుంది. గ్రీకు పురాణాల్లోనూ హిందూ పురాణాలలో అసంబద్ధతలు అనేకం ఉన్నాయని అంగీకరిస్తూ, అక్కడి మేధావులు మాత్రం వాటి అసలు స్వరూపాన్ని గ్రహించి, తిరస్కరించారనీ, మన పండితులు వాటిని ఆమోదించారనీ ఆవేదన వ్యక్తం చేస్తారు నార్ల. వారి మాటల్లోనే –

"ప్రాచీన కాలంలోనే పురాణాలను ఒక పక్కకు నెట్టినందునే, పౌరాణిక గాథలలో నిజం కంటే అబద్ధం, నీతికంటే అవినీతి, ఉదాత్తతకంటే నైచ్యం, అన్నింటినీ మించి, వాస్తవం కంటే కల్పన అత్యధికంగా వుంటాయని గుర్తించిన ఘనత కూడ గ్రీక్ మేధావులకే దక్కింది. అందువల్లనే ప్రపంచం మొత్తం మీదనే మొట్టమొదటి చరిత్రకారుడు గ్రీసులో తలయెత్తాడు' అంటారు (నరకంలో హరిశ్చంద్రుడు–పుట 15). 'అరిస్టాటిల్' వంటి తత్వవేత్త మన దేశంలో పుట్టకపోవడం మన దురదృష్టమని తరచు అంటారు

పురాణాలను విమర్శనాత్మకంగ చూసే గ్రీకు పండితుల దృష్టి మన వాళ్లకు లేకపోగా, వాటిని మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దుతూ, వాటికి మరిన్ని నగిషీలు

చెక్కుతూ, పాఠకులను మరింతగా తప్పుదోవ పట్టిస్తున్నారని భారతీయ పండితులను ఖండిస్తారు. పురాణాలలో నీతి లేకుండా పోలేదు కానీ అది సమాజాభివృద్ధికి దోహదం చేసేది కాదని ఆయనంటారు. స్త్రీలకు సంబంధించి పురాణాలు చేసే 'బ్రెయిన్ వాషింగ్ ' ని తీవ్రంగా గర్హిస్తూ, స్త్రీలకోణం నుంచి పురాణాలను పునర్విమర్శ చేయడం ఎంత అవసరమో, స్త్రీవాదుల కంటే ముందే చెప్పారు నార్ల. అయితే ఈ విషయంపై తన కంటే ముందు నాటికలు రాసిన చలంని ఆయన ప్రస్తావించినట్టు కనిపించదు. 'మతం నుంచి మానవుణ్ణి, మానవసంఘాన్ని, మానవజీవితాన్ని వేరు చేయడం మనవారికి తెలియదు' (పుట 39) అన్న ఆయన మాట ఈరోజులకు మరింతగా వర్తిస్తుంది.

కర్మ సిద్ధాంతం గురించి, పునర్జన్మల గురించి, కులాల్లో బ్రాహ్మణాధిక్యం గురించి ఎంతో తీవ్రంగా మాట్లాడిన నార్ల, విశ్వనాథ సత్యనారాయణ రచనల్ని గర్హిస్తూనే, ఆయన వ్యక్తిత్వాన్ని మెచ్చుకున్నారు. విశ్వనాథ ఒకసారి తన గురించి 'అందరూ ఆడిపోసుకునేట్టు మీరు బ్రాహ్మణ ద్వేషులు కారు; బ్రాహ్మణత్వ ద్వేషులు' అన్నప్పుడు చెమ్మగిల్లిన కళ్లతో ఆయనకు నమస్కరించారట! (పుట 42). విశ్వనాథ సాహిత్యం పట్ల తనకు గౌరవం లేకపోయినా, ఆయనలో ఏ మాత్రం హిపోక్రసీ లేకపోవడం, తను ఏం నమ్మారో దానికే కట్టుబడివుండడం తనకు ఆయన పట్ల గౌరవం కలిగించిందని నార్ల అంటారు. హరిశ్చంద్రుడి గురించిన చర్చలో, ఆయనను తన ఆదర్శంగా చెప్పుకున్న గాంధీని కూడ ప్రస్తావిస్తూ, గాంధీపై తన అభ్యంతరాలను, ఆయన 'అసంబద్ధ' జీవితాదర్శాలను తీవ్రంగా ఖండించారు నార్ల. గాంధీ గురించి చాలా విస్తారంగా మాట్లాడుతూ, ఆయన తన స్వీయచరిత్రలో చెప్పిన విషయాలను ఖండించార్ట్ము తనకు ఇష్టం వచ్చినట్లు తను జీవించవచ్చుగానీ, ప్రజలందరిపై తన జీవన విధానాన్ని రుద్దడానికి గాంధీ ప్రయత్నించాడని దుయ్యబట్టారు.

ఇక ఈ నాటికలో మొదటి అంకంలో హరిశ్చంద్రుడు అనారోగ్యం పాలవుతాడు. ఆయన జీవితచరమాంకంలో ఉన్నాడు. ఆయన్ని చూడ్డానికి చంద్రమతిగానీ, లోహితాస్యుడు గానీ రాలేదు. ఆయన అనుచరులు, రాజ వైద్యులు మాత్రమే ఉంటారు. అంకం పూర్తయ్యేసరికి ఆయన మరణించాడని వైద్యుడు ప్రకటిస్తాడు. ద్వితీయాంకంలో హరిశ్చంద్రుడు నరకంలో యముడికి ఎదురుగా ఉన్నాడు. అక్కడ యముడితో, చిత్రగుప్తుడితో తనను పంపేయాలని వాదం పెట్టుకుంటాడు. తను స్వర్గానికి అర్హుడనీ, ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చారనీ వాదిస్తాడు. క్రమంగా తను

చేసిన తప్పులు (భార్యనీ, కొడుకుని అమ్మడం, విశ్వామిత్రుని అసమంజసమైన ఆజ్ఞలకు శిరసావహించడం) తెలుసుకుని, యముడిని క్షమాపణ కోరుకుంటాడు. మూడవ అంకంలో చనిపోయాడనుకున్న హరిశ్చంద్రుడు తిరిగి లేస్తాడు. అంటే రెండో అంకంలో జరిగిందంతా అతని ఊహ. లేదా, తాత్కాలిక మరణం. హరిశ్చంద్రుడికి కనువిప్పు కలిగించిన నరకానుభవం. తిరిగి ప్రాణం వచ్చిన హరిశ్చంద్రుడు పాత హరిశ్చంద్రుడు కాడు. మారిపోయాడు. కొడుకును క్షమాపణ కోరుతాడు, వశిష్ఠుడిని ఉద్దేశించి, కుమారుడితో 'ఈ మునిముచ్చుల గుప్పిటిలోంచి ఇప్పటికైనా మనం బయటపడినందుకు సంతోషించాలి" అంటూ తాను నిజంగా సత్యమార్గంలో ప్రయాణించాలంటే, వశిష్ఠుడిని, విశ్వామిత్రుడు వంటి దుష్టగ్రహాలని వదిలించుకోవాలని ప్రకటించడంతో నాటిక ముగుస్తుంది.

**సీతజోస్యం:**

ఈ నాటికకు వందకుపైగా పుటల పీఠిక రాశారు నార్ల. ఇందులో రామాయణంపై ఎన్నో కొత్త విషయాలను చర్చిస్తారు. రాముడు చారిత్రక పురుషుడు కాడని, అతని ప్రస్తావన క్రీస్తుపూర్వం ఎక్కడా కనిపించదనీ నార్ల అనేక ఆధారాలను ఉటంకించి చెప్తారు. నార్ల అనుసరించిన, నమ్మిన చారిత్రక వ్యక్తులు జర్మన్ పండితుడు వెబర్, బెంగాల్ చరిత్రకారుడు రమేశ్ చంద్ర దత్. వీరి పరిశోధనలను లోతుగా అధ్యయనం చేసిన ఫలితంగా నార్ల, రాముడు విష్ణువు అవతారం కాదనీ, రుగ్వేదంలోని ఇంద్రుడికి మరో రూపమనీ, రామరావణ యుద్ధం, ఇంద్రవృత్రాసురుల యుద్ధానికి మరో రూపమనీ నమ్మారు. వేదాల్లో పేర్కొన్న రాముడు, సీత పురాణకాలం నాటికి పూర్తిగా మారిపోయారనీ, అంటే పురాణాలలో వీరికి కాల్పనిక రూపం, కల్పిత కథ వచ్చాయనీ, కనక రామాయణానికి చారిత్రకత లేదనీ నార్ల వారి తీర్మానం. రామాయణం ఇలియడ్ ప్రభావంతో పుట్టిందన్న వాదాన్నీ (వెబర్, సునీత్ కుమార్ ఛటర్జీల వాదం). ఇలియడే రామాయణం ప్రభావంతో పుట్టిందన్న వాదాన్నీ (ఫ్రెండి పండితుడు ఇపోలిట్ పోష్) రెండిటినీ పరిశీలించారు. రాముడు ఈజిప్టును పరిపాలించిన ఫేరో రాజులలో ఒకడని తెలుగు పండితుడు మల్లాది వెంకటరత్నం వాదాన్ని కూడ నార్ల పరిశీలించారు. అంటే ప్రాచ్య పాశ్చాత్యులు రామాయణంపై వెలిబుచ్చిన అభిప్రాయాలు, సిద్ధాంతాలు అన్నిటినీ పరిశోధించి, అంతిమంగా తను రామాయణం గురించి ఏం చెప్పదలుచుకున్నారో స్పష్టం చేశారు. అయితే రామాయణ మహాభారతాల చారిత్రకత నిరూపించడానికి భారత పురాతత్వ శాస్త్రవేత్తలు గానీ,

చరిత్రకారులు గానీ ప్రత్యేకంగా ప్రయత్నించలేదనీ, భారతీయులు రామకృష్ణులను అవతారపురుషులుగా భావిస్తున్న నేపథ్యంలో చారిత్రకతను వెలికి తీస్తే ప్రజల విశ్వాసాలు దెబ్బతింటాయన్న భావనతోనే వారు పరిశోధనలకు పూనుకోలేదనీ నార్ల ఆరోపించారు.

రామాయణంలో 75 శాతం పుక్కిటి పురాణమనీ, రావణుడి లంక, ఇప్పటి శ్రీలంక కానేకాదనీ, రావణుడు ఏదో ఒక ఆదివాసీ తెగ రాజై వుంటాడనీ, రామరావణ యుద్ధం రెండు జాతుల మధ్య జరిగిందని చెప్పడం కంటే, ఆహారోత్పత్తి వ్యవస్థకు, ఆహార సేకరణ వ్యవస్థకు మధ్య జరిగిన సంఘర్షణ అని చెప్పడం సమంజసమనీ, రాముడు వింధ్య పర్వతం దాటి ఇటువైపు రాలేదనీ నార్ల తీర్మానించారు.

సీత జోస్యం ముందు మాటలో ఆయన చర్చించిన ఇతర విషయాలు ఈ శీర్షికల కింద ఉన్నాయి – రాక్షసులెవరు, రుషులెవరు, రుషుల కుట్రలో రాముని పాత్ర, ఆయుధాలు, సీతారాములు. రాక్షసులెవరు, రుషులెవరు అన్న అధ్యాయాలలో నార్ల అనేక చరిత్రగ్రంథాల పఠనం ద్వారా లభించిన సమాచారాన్ని ఒక సారాంశంగా చెప్పడానికి ప్రయత్నించారే గానీ ఆ ఇద్దరి నిర్వచనానికి తృప్తికరమైన సమాధానం సాధించలేకపోయారు. అయితే రాక్షస జాతిని పురాణాల్లో పరమ దుర్మార్గులుగా, నీచులుగా చూపించడాన్ని మాత్రం తప్పుపట్టారు. అలాగే రుషులను పరమోత్తములుగా, పూజనీయులుగా చిత్రించడాన్ని కూడ తిరస్కరించారు. నార్ల తన వాదనకు బలం చేకూర్చడానికి కేవలం చరిత్రకారుల గ్రంథాలనే కాక, వాల్మీకి రామాయణాన్నే ఉటంకించారు. రుషులు, రాజులు యజ్ఞయాగాదుల నెపంతో అడవులపై ఆక్రమణకు పూనుకుంటున్నారన్న సూచన సీతారాముల సంభాషణలోనే వ్యక్తమవుతుందని ఆయన స్పష్టంగా చెప్పారు. సీత రాముడినిదండకారణ్యంలో విల్లు చేతబట్టి బయల్దేరిన భర్తను అడుగుతుంది – ఈ ఆటవికులు మీకేం అన్యాయం చేశారని వారి మీదికి దండెత్తుతున్నారు?' అని. ఆటవికులు ఆహారసేకరణ ప్రాతిపదికగాగల ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధులు. రాముడు ఒక ఆశ్రమం నుంచి మరో ఆశ్రమానికి వెళ్లే క్రమంలో ఆయా చోట్ల నివాసమేర్పరచుకున్న ఆటవికులను సంహరించాడనీ, ఇది అగస్త్య మహర్షి సూచనల మేరకు చేశాడనీ, దీన్ని సీత సైతం ఖండించిందనీ వాల్మీకి రామాయణం ఆధారంగానే నార్ల పాఠకులకు గుర్తు చేస్తారు. ఇలా రామాయణాన్ని బాహ్య, అంతర్గత సాక్ష్యాలతో విమర్శనా దృష్టితో చర్చించాలి తప్ప, కేవలం భక్తి విశ్వాసాలతో కాదని నార్ల పదే పదే చెప్తారు.

సీతారాములు అన్న శీర్షికతో రాసిన వ్యాసంలో చలం నుంచి ఈనాటి స్త్రీవాదుల వరకూ చేసిన విమర్శలే నార్ల చేశారు. స్త్రీవాద సాహిత్యం ఇటువంటి విమర్శలు ప్రకటించక ముందే 1978 లోనే ఈ పీఠిక రచించారు. సీత గురించి వివరంగా చెప్పిన తర్వాత 'రామాయణం మొత్తం మీద సంస్తవించదగు వ్యక్తి రాముడు కాదు; సీత. అటు తర్వాత సంస్తవించదగు వారు భరతుడు, లక్ష్మణుడు. ఆత్మాభిమానంలో గాని, హృదయవైశాల్యంలో గాని బుద్ధిసూక్ష్మతలోగాని, వాక్చాతురిలోగాని, ధర్మాభినిరతిలోగాని సీతకు ఏడువెనుకలుగా నిలవవలసిన వాడే రాముడు. ఇక, త్యాగ గుణంలో భరతునికి ఒక యోజనం దూరంలోనికైనా రాముడు రాడు; రాలేడు' (పుట 109) అని నిష్కర్షగా చెప్తారు నార్ల.

సీత జోస్యం నాటిక, తక్కిన రెండు నాటికల్లా పరిమాణంలో చిన్నది. దానికి విస్తారమైన పీఠికతో పాటు, రెండు అనుబంధాలు కూడ చేర్చారు. ఒకటి–దశరథ జాతకం, రెండోది – వైరము లేకనే వధ. మొదటి దానిలో దశరథుడు, రామలక్ష్మణభరతులు, సీత పాత్రలుగ ఉన్న పాళీ భాషలోని జాతక కథను చెప్పారు. అందులో సీత రామాదులకు సోదరి. కథలో అరణ్యవాసానికీ, భరతుడు రాజ్యమేలడానికీ రామాయణంలో ఉన్న కారణాలేవీ లేవు. కానీ కథలో పోలికలు మాత్రం ఉన్నాయి. ఈ పాళీ కథను నార్ల చెప్పడంలోని ఉద్దేశం, రామాయణం ఈ కథనుంచి స్వీకరించి, కల్పనలతో రాసింది అని చెప్పడమా? ఈ కథను పాళీ నుంచి తెనిగించిననది స్వామీ శివశంకరశాస్త్రి అని నార్ల పేర్కొన్నారు. రెండో అనుబంధం ఇంతకుపూర్వమే ప్రస్తావనకు వచ్చిన అరణ్య సర్గలో రాముడికి సీత బోధ. ఆటవికులను చంపడం నేరమని, రాముడికి తగదనీ సీత చెప్పిన మాటల్ని ఇక్కడ విపులంగా రాశారు.

ఇక సీతజోస్యం నాటికలోకి ప్రవేశిస్తే – ఇందులో రాముడు, సీత, లక్ష్మణుడు, కొందరు రుషులు పాత్రలు. సీతకు రుషుల వ్యవహారసరళి, వారు రామున్ణి పెడదోవ పెడుతున్న వైనం పట్ల ఆగ్రహం, వెటకారం ఆమె ప్రతి సంభాషణలోనూ వ్యక్తమవుతాయి. సీత మాటల్లో నార్ల వారి అభిప్రాయాలే ప్రతిధ్వనిస్తాయి. రుషుల పట్ల రాముడి అపారమైన గౌరవం, భక్తిప్రపత్తులు, వారి కోసం అరణ్యవాసులను నిర్మూలించడానికి రాముడు పూనుకోవడం, సీత బాధ, వ్యంగ్యం – వీటి మధ్య లక్ష్మణుడి అయోమయం – చక్కగా ఈ నాటికలో నిర్వహింపబడ్డాయి. దాదాపు అరణ్య సర్గంలో సీత రాముడికి చెప్పే బోధలే ఇందులో వస్తువు.

ఈ రచనకే నార్ల వారికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. మొత్తం మీద పురాణాల ఆధారంగా నార్ల వారు రచించిన ఈ మూడు నాటికలు, పాఠకులను ఆలోచింపజేస్తాయి. పురాణవ్యాఖ్యానం ఇన్ని రకాలుగా ఉండవచ్చునా అనిపించేలా సాగుతుంది ఆయన రచన. అంతే కాక, కేవలం తన అభిప్రాయంగా మాత్రమే కాక, విశ్వవ్యాప్తంగా అనేక గ్రంథాలు ఆయన పరిశీలించి, వాటి సారాన్ని ఆధారం చేసుకుని చేసిన విమర్శలోని తార్కికత, బుద్ధిజీవులైన పాఠకులకు కొత్తకోణాలను ఆవిష్కరిస్తుంది.

నార్ల రచించిన మరో రెండు పౌరాణిక నాటికలు: ద్రౌపది (పంచరాత్రం) హిరణ్యకశిపుడి వధ. ద్రౌపదిని అర్జునుడు స్వయంవరంలో గెలుచుకుని వచ్చినపుడు కుంతి అలవాటులో పొరబాటుగా 'అందరూ పంచుకోండి' అనడం వల్ల ద్రౌపది పంచభర్తృక అయిందని ఎక్కువగా మనం వినే వ్యాఖ్యానం. కానీ నార్ల వారు కుంతి అలా అనడానికి వేరే కారణం ఊహించారు. కుంతి కావాలనే ఆ మాట అన్నట్టు ఆయన వ్యాఖ్యానించారు. ఎందుకంటే కుంతి కూడ పంచభర్తృక లెక్కకే వస్తుంది. సూర్యుడు, యముడు, వాయువు, ఇంద్రుడు – ఈ నలుగురి ద్వారా ఆమె సంతానవతి అయింది. ఇక ఆమె పెళ్లి చేసుకున్న వ్యక్తి అయిదోవాడు – పాండురాజు. ఆమె స్వయంగా పంచభర్తృక కనక కోడలికి కూడ అదే జరగాలని ఆమె కోరుకుంది కనక అలా ఆదేశించిందన్నది నార్ల వారి వ్యాఖ్యానం. అంతే కాక, మామూలుగా భారతం చదివిన వారు చెప్పినట్లు, తమ్ముళ్ళకు అన్న ధర్మరాజు మాట శిరోధార్యం అన్నట్టు ఈ నాటికలో ఉండదు. తమ్ముళ్లందరికీ అన్నగారి మీద ఆగ్రహం ఉన్నట్టు. ద్రౌపది విషయంలో ఈర్ష్యాసూయలున్నట్టు నార్ల వారు చిత్రించారు. హిరణ్యకశిపుడి వధ నాటికలో కూడ ప్రహ్లాదుడిని ప్రతినాయకుడిగా, హిరణ్యకశిపుడిని నాయకుడిగా ఆయన చూపిస్తారు.

ఈ పౌరాణిక నాటికల్లో నార్ల ఎత్తిచూపిన కొత్త విషయాలు నిరాధారమైనవి కావు. కానీ ఎన్నో ఏళ్ల నుంచి భారతీయ సంస్కృతిలో భాగమైపోయి భారతీయుల సామూహిక అచేతనలో పురాణపురుషులకు ఒక నిర్దిష్టమైన రూపం ఏర్పడి, ఆ విశ్వాసం నిత్యజీవితాలను కూడ ఆక్రమించుకున్న నేపథ్యంలో నార్లవారి తార్కికతను మెచ్చుకోగలరే కానీ, వాటిని అంగీకరించడం బహుశా ఎక్కువమందికి సాధ్యపడదు.

## కొత్త గడ్డ నాటికలు

ఈ సంకలనంలో 16 నాటికలున్నాయి. ప్రజలలోని మూఢవిశ్వాసాలు, రైతుల అగచాట్లు వర్ణించేవీ, సమాజంలో స్త్రీల ప్రతిపత్తిని వ్యాఖ్యానించేవీ ఉన్నాయి. ముఖ్యంగా ప్రజలలో హేతువాద దృక్పథాలు ప్రవేశపెట్టి, సమాజంలో కుల, వర్గ, జెండర్ పునాదులపై సమానత్వం నెలకొనాలని ఆశించే నాటికలు ఇవి.

ప్రారబ్దం – ఈ నాటికలో డబ్బు ఖర్చుకు చూసుకుని, పిల్లకు నాటువైద్యం ఇప్పించి, ఆరోగ్యం పాడవుతున్నా 'అంతా ప్రారబ్దం; దాని కర్మ ఎలా వుంటే అలా అవుతుంది – దానికంతే ప్రాప్తం' వంటి శుష్కవేదాంతంతో కూతుర్ని చంపుకున్న తండ్రి, అతన్ని ఖండించినా, అతనికి వ్యతిరేకంగ వెళ్లలేకపోయిన తల్లి, కొడుకు, మరో కూతురు – ఇదీకథ.

దాంపత్యం, ఆడబ్రతుకు అనే నాటికలు ప్రయోగాత్మకం. దాంపత్యంలో భార్య, భర్త ఇద్దరూ రంగం లో ఉంటారు. అతను మాట్లాడడు. కేవలం హావభావాలు ప్రకటిస్తాడు. చదువురాని, భోళా భార్య ఎడతెరిపిలేకుండా మాట్లాడుతుంది. పైకి సరదాగా ఉన్నా, ఇందులోని అంతరార్థం మన దృష్టిని దాటిపోదు. చదువుకోని భార్య, చదువుకున్న భర్త కొన్ని దశాబ్దులు మన సమాజంలో సహజదృశ్యం. భార్యతో మాట్లాడడానికి ఏమీ ఉండదనే చులకన భావం ఆయనక్కు తనకేమీ తెలీదని రోజూ గుర్తు చేసే భర్త సన్నిధిలో ఆత్మన్యూనత ఆమెలో.. క్రమంగా ఆ న్యూనతే గయ్యాళితనంగా మారుతుంది. భర్త ఆమె మానసిక స్థితిని అర్థం చేసుకోలేక, కోపంతో ఇంటినుంచి బయటకు వెళ్లిపోతాడు. ఉక్రోశంతో అతను మరో స్త్రీ వద్దకు పోతున్నాడని భావించి, దు:ఖంలో, పశ్చాత్తాపంలో మునిగిపోతుంది భార్య. ఇది ఆనాటి స్త్రీల సామాజిక, వైవాహిక స్థితిని ఎంతో నేర్పుగా చిత్రించిన నాటిక. పోనీ చదువుకున్న స్త్రీకి భర్త నుంచి గౌరవం లభిస్తుందా అంటే ఆ గ్యారంటీ లేదు. 'అర్ధాంగి' నాటికలో ఈ కోణం కూడ చూపుతారు. తనతో సమానంగా చదువుకున్న భార్య, సమానంగా సంపాదిస్తున్న భార్యకు కూడ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అంగీకరించలేని భర్తల స్వభావాన్ని ఇందులో చిత్రిస్తారు. ఒక స్త్రీ సంపాదన పరురాలైనా, ఆమె స్వేచ్ఛగా డబ్బు ఖర్చు చేస్తే ఆమె శీలాన్ని శంకించడానికి వెంటనే తయారైపోయే భర్తలను ఈయన తన నాటికల్లో చూపుతూ, స్త్రీకి వివాహబంధంలో సమానత్వం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తారు.

'వంతెన' పల్లెలు వాహన సదుపాయంతో పట్టణాల లక్షణాలను పులుముకోవడం వల్ల వచ్చే కష్టనష్టాలను చిత్రించే నాటిక. ఆనాటి సామాజిక జీవితాన్ని దగ్గరగా, విమర్శనాత్మకంగా చూసిన నార్ల, పల్లెల్లో వంతెన నిర్మించడాన్ని ప్రతీకాత్మకంగా చూపారు. అప్పటివరకూ ఉన్న సాధారణ, నిరలంకారమైన, నిరాడంబరమైన జీవితం బయటి నాగరికతతో వంతెన ద్వారా అతుకు పడేటప్పటికి ఎలా మారిపోతుందో చక్కగా చెప్పిన నాటిక.

'కొత్తగడ్డ' నాటిక రైతుల జీవితాల్లో అనివార్యంగా వచ్చిన మార్పును చిత్రించిన మంచి రచన. తన స్వంత ఊరు, భూమి వదులుకోలేని రైతు, కష్టమైనా, సుఖమైనా తన గడ్డను వదిలి వెళ్లలేననుకునే రైతు తన తర్వాతి తరం కోసం మరింత మెరుగైన జీవనం కోసం 'కొత్తగడ్డ' కు వెళ్లడానికి ఉద్యుక్తుడు కావడం, తండ్రిలో వచ్చిన మార్పుకు కొడుకు సంతోషించడం. సమాజంలో మార్పు సహజమనీ, దాన్ని స్వాగతించడానికి సంసిద్ధులుగా ఉండాలనీ రచయిత చెపుతున్నట్టు అనిపిస్తుంది.

'శకున పక్షి' నాటికలో సామెతల వాడకం ఆ తర్వాత సినిమాల్లో కూడ సామెతలు కుప్పించే పాత్రల సృష్టికి దారితీసిందని చెప్పవచ్చు. ఒక్కో పాత్రకు ఒక్కో ప్రవృత్తిని చూపడం ద్వారా హాస్యం వినోదం సృష్టించడమన్నదానికి ఈ నాటిక ఒక నిదర్శనం. పొద్దున్నే వచ్చిన వాన, పొద్దుపోయి వచ్చిన చుట్టం పోయేదిలేదని , చల్ల కొచ్చి ముంత దాస్తున్నాననేగా" వ'లచి వస్తే మేనమామ కూతురు వరస కాదనే రకం , రోహిణీ కార్తెలో రోళ్ళు బద్దలుతా'యని, అమ్మాబోతే ఆదివి కొనబోతే కొరివి' .. ఇలా పాతవాళ్ల మాటల్లో నిరంతరం దొర్లే సామెతలతో సంభాషణను రక్తి కట్టిస్తారు.

నార్ల వారి నాటికలు, సహజమైన సంభాషణలతో, అక్కడక్కడా చమత్కారాలతో, మంచి పాత్ర చిత్రణతో, స్వాభావికమైన ఆంగికం వర్ణనతో ప్రదర్శనకు అనుకూలంగా ఉంటాయి.

**నార్ల పద్యాలు:**

ఇవి వేమన పద్యాల్లా ఎన్నో సామాజిక నీతులను అందిస్తాయి. తెలుగు సాహిత్యంలో ఆయన అత్యధికంగా, మనస్ఫూర్తిగా అభిమానించిన వేమననే అనుసరిస్తూ పద్యాలు రాశారు. వీటిలో సామాజిక నీతిని చెప్పేవే ఎక్కువ. కుల వ్యవస్థ గురించి, పదవుల గురించి, స్వేచ్ఛ గురించి, ప్రజాస్వామ్యం గురించి, తార్కికత గురించి ఎన్నో పద్యాలు రాశారు. మచ్చుకి కొన్ని

*జాతి మత కులాది సకలభేదమ్ములు*
*వీగిపోవు సమత విరిసినంత :*
*సమతలేని జగతి యమలోక సమమురా,*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

పదవి గురించీ

*అబ్బగాన పదవి ఉబ్బి తబ్బిబ్బులై*
*బొబ్బరించువాడు దెబ్బ తినును*
*నిబ్బరించువాడె నిల్కడగా నుండు*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

*మంత్రియైననాడు మన్నన లందును;*
*పదవి పోయినంత ఫలుచబడును :*
*"పంచరైన "టైరు" -పదవిపోయిన మంత్రి యాయె*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

కులతత్వాన్ని నిరసిస్తూ ఆయన చెప్పిన పద్యాలు

*తెగువ జంపి, జాతి తెలివి తేటలు చంపి*
*చెలిమి చంపి, బ్రతుకు విలువ చంపి*
*నిలువున దిగమింగు కులవిభేద పిశాచి*
*వాస్తవమ్ము నార్లవారి మాట*

*విలువకట్టరాదు కులగోత్రములబట్టి;*
*కులము తక్కువైన దులువ కాదు;*
*గొప్ప రాదు ఋషుల గోత్రజుడైనంత*
*వా స్తవమ్ము నార్లవారి మాట*

హేతువాది అయిన నార్ల తన పాఠకులకు అన్నిటికంటే ముందుగా చెప్పదలుచుకుంది ప్రశ్నించే వైఖరిని పెంచుకోమని. వ్యాసంలో, నాటికలో, పత్రికా సంపాదకీయాల్లో, పద్యంలో అన్నిటిలోనూ ఆయన ఇదే సందేశం ఇచ్చారు.

*ప్రశ్ననుండి పుట్టు పరిణతజ్ఞానమ్ము;*
*ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము*
*ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్థకమ్మురా*
*వాస్తవమ్ము నార్లవారిమాట*

నార్లవారి మాటలో ప్రతిపద్యమూ ఉల్లేఖనీయమే. ఈనాటికీ ప్రాసంగికత కలిగినవే.

నిరీశ్వరవాది అయిన నార్ల తన పద్యాల్లో భగవంతుడి పట్ల నిరసనను, వ్యతిరేకతను తరచు వ్యక్తం చేస్తారు. మచ్చుకి –

*నరుని భక్తి నుండి హరుడు యుద్భవించెను*
*నరుడి భయము నుండి హరుడు పుట్టె*
*నరుడు లేనినాడు హరిహరాదులు లేరు*

అలాగే దైవభక్తి కాదు; మానవతే అసలు మతమని చెబుతూ

*తిండి పెట్టనేల తినలేని బొమ్మకు*
*మాధ్చనేల తోటి మనిషి కడుపు?*
*మానవతను జంపు మతమేమి మతమురా'*

ఈ విధంగా ఆయన సాహిత్యమంతా హేతువాదంతో, మానవతాదృక్పథంతో ప్రకాశిస్తూంటుంది.

నార్లవారు రాసిన ఇతర సాహిత్య గ్రంథాల్లో చెప్పదగినవి జీవితచరిత్రలు, వేమన, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావుగార్ల జీవితచరిత్రలను కేంద్ర సాహిత్య అకాడెమీవారి 'భారతీయ సాహిత్య నిర్మాతలు' శీర్షిక నిమిత్తం, వారి కోరికపై, నార్ల ఆంగ్లంలో రచించారు. ఇవి మూడు అనంతరం తెలుగులో కూడ అనువాదమయ్యాయి. నార్ల రాసిన మూడు జీవితచరిత్రలూ ఆయన అభిమానించి, గౌరవించిన రచయితలవే. వేమనపై వచ్చిన ప్రతి రచననూ చదివిన తర్వాత, వంగూరి సుబ్బారావు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మల పుస్తకాలే సహేతుకంగా ఉన్నాయని ఆయన భావించారు. వేమనను మహాకవిగా భావించిన నార్ల, ఇతర పండితులు అతన్ని మహాకవిగా చెప్పనందుకు బాధపడ్డారు. వేమనకు తను అన్నింటా రుణపడివుంటానని చెబుతూ, ఆయన ఎంతో అందంగా రాసిన ఆటవెలదిలోనే తను కూడ నార్ల వారి మాట పద్యాలు రాయడం వేమన ప్రభావంతోనే అని

చెప్పుకున్నారు. వీరేశలింగం జీవితచరిత్రలో, ఆయన ఆధునిక సాహిత్యానికే కాదు; పత్రికా రచనకు కూడ మూల పురుషుడని అన్నారు నార్ల. వీరేశలింగం రచనలను, అటువంటి పాశ్చాత్య రచయితలతో పోలుస్తూ విశ్లేషించారు. గురజాడ జీవితకాలంలో ఎక్కువ ప్రశంసలు పొందలేదనీ, మరణానంతరమే తెలుగు సాహిత్యలోకానికి ఆయన విలువ తెలిసివచ్చిందనీ, గురజాడ మోనోగ్రాఫ్‌లో అన్నారు నార్ల. ఈ ముగ్గురివీ సమగ్ర జీవిత చిత్రణలు కాక, మరెందరో సమకాలీనుల గురించి అనేక వ్యాసాలు రచించారు. వీరిలో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, కాశినాథుని నాగేశ్వరరావు, తాపీ ధర్మారావు, ముట్నూరి కృష్ణారావుల పట్ల ఆయనకు గల అభిమానం, శ్రీశ్రీ పట్ల ఆయనలోని అసహనం సువ్యక్తమవుతాయి. శ్రీశ్రీని గొప్పకవిగా పేర్కొన్నారు కానీ, వ్యక్తిగా అతన్ని నార్ల గౌరవించలేదు. చివరి రోజుల్లో నార్ల రాసిన ఆంగ్ల గ్రంథం 'ది ట్రూత్ ఎబౌట్ గీత' (గీతారహస్యం అని తెలుగులో ఎన్. ఇన్నయ్య అనువదించారు). భగవద్గీతను తీవ్రంగా విమర్శిస్తూ చేసిన రచన ఇది.

జీవితాంతం అందరూ వెళ్లిన దారిలో వెళ్లక, పాత్రికేయరంగంలోనూ, సాహిత్య రంగంలోనూ కొత్త బాట వేసుకున్న నార్ల వెంకటేశ్వరరావు, ఎక్కడా రాజీపడని వ్యక్తిగా, చప్పట్ల కంటే చిత్తశుద్ధికే ప్రాధాన్యం ఇచ్చిన మేధావిగా తెలుగు సమాజంలో గుర్తుండిపోతారు. 'నేను రాసింది మీకు నచ్చదు' అంటూనే తన జ్ఞానంతో, పరిశోధనతో, అపరిమితమైన అధ్యయనంతో, తను అర్థం చేసుకున్న పద్ధతిలో భారతీయ సాహిత్యాన్ని దర్శించి, దాన్ని నిర్భీతితో ప్రకటించిన అపురూప సాహితీవేత్త నార్ల. ఆయనతో అందరూ ఏకీభవించలేకపోవచ్చు; ఆయన చేసిన వ్యాఖ్యానాలకు పరిమితులూ ఉండవచ్చు. కానీ ఆయనలోని నిజాయితీ, అధ్యయనశీలత, హేతుబద్ధత, జ్ఞానం అతి తక్కువమందిలో మాత్రమే చూడగలం.

**– మృణాళిని**

# మృణాళిని - క్లుప్త పరిచయం



డా. సి. మృణాళిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన కేంద్రంలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం మిల్‌పిటాస్, కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖకు అధ్యక్షురాలిగా ఉంటూ, తెలుగులో సర్టిఫికెట్, డిప్లొమా, ఎం.ఏ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది కాక, ప్రస్తుతం ఆమె కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహామండలి కన్వీనర్‌గా ఉన్నారు.

తెలుగు సాహిత్యంలో విమర్శకురాలిగా, అనువాదకురాలిగా, కథారచయిత్రిగా, సాహితీసదస్సుల్లో వక్తగా, తెలుగు సాహిత్యానికి ఇతర భారతీయభాషా వేదికలపై ప్రచారం తెచ్చిన వ్యక్తిగా, విద్యావేత్తగా ఆమె సుప్రసిద్ధులు. డా. మృణాళిని విమర్శ, కథ, అనువాదాలు, జీవిత చరిత్ర కలిపి ఆమె ఇప్పటివరకూ 25 గ్రంథాలు రచించారు. కోమలి గాంధారం, తాంబూలం, మృణాళిని ప్రేమకథలు వంటి సృజనాత్మక రచనలు, మూడు హాస్యనవలికలు కాక, తెలుగు నవలలో కథన శిల్పం, ఇంతిహాసం, నిశ్శబ్ద విప్లవాలు, ప్రతిధ్వని, సకల, విశ్వమహిళా నవల అన్న విమర్శ గ్రంథాలు, మహమ్మద్ రఫీ పై ఒక గ్రంథం రచించారు. 12 కు పైగా అనువాదాలు చేశారు. వాటిలో ఆర్. కె. నారాయణ్ మాల్గుడి కథల అనువాదానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ అనువాదం అవార్డు అందుకున్నారు. సాహిత్య అకాడెమీ కోసం గుల్జార్ కథలను తెలుగులోకి అనువదించారు. గృహలక్ష్మి కంకణం, గుప్తాఫౌండేషన్ పురస్కారం, ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డులతో సహా 25 కు పైగా పురస్కారాలు అందుకున్నారు. అమెరికా, చైనా, మారిషస్, మలేసియాలలో సాహితీ ఉపన్యాసాలు చేశారు. దూరదర్శన్‌లోనూ, ఇతర టెలివిజన్ ఛానెళ్లలోనూ, యూట్యూబ్ ఛానెల్‌లోనూ కలిపి రెండువేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం ఐడ్రీమ్ మీడియాలో అక్షరయాత్ర అనే సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

డా. సి. మృణాళిని ఎం.ఏ తెలుగు, ఎం.ఏ ఇంగ్లీషు, ఎం.ఏ విమెన్ స్టడీస్, తెలుగులో ఎం.ఫిల్, పిహెచ్. డిలు చేశారు. ఆమె పర్యవేక్షణలో 35 మందికి ఎం.ఫిల్ డిగ్రీలు, 18 మందికి పిహెచ్.డి డిగ్రీలు లభించాయి.

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

## డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

